క్లుప్తంగా

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు



ఎంఈఓకు ఫిర్యాదు

రామకుప్పం: స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేసుకుంటూరని మిట్టపల్లి గ్రామానికి చెందిన కేశవరెడ్డి, నవీన్ గురువారం రామకుప్పం ఎంఈఓ నారాయణకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా 10వ తరగతి వరకు అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈవిషయంపై పాఠశాల కరస్పాండెంట్ ఆరేళ్ల జయప్పను వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి పాఠశాలను నడుపుతున్నట్లు తెలిపారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

- పలమనేరు ఎంవీఐ మధుసూదన్



పలమనేరు: నియోజకవర్గంలోని స్కూల్, కళాశాలకు చెందిన బస్సుల విషయంలో సమస్యలుంటే తనకు ఫిర్యాదు చేయాలని పలమనేరు ఎంవీఐ మధుసూదన్ తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక ఎంవీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే 256 బస్సులను ఎఫ్‌సీ చేశామన్నారు. ఫిట్‌నెస్‌లేని బస్సులను ఏమాత్రం అనుమతించే ప్రసక్తే ఉండదన్నారు. స్కూల్ బస్సులకు డ్రైవర్లు సైతం హెవీ లైసెన్స్ కలిగి 60 ఏళ్ల వయసులోపు ఉండాలనే నిబంధనలు విధిగా పాటిస్తున్నామని తెలిపారు. బస్సుల విషయంలో నిర్లక్ష్యం చేసే యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీసీజీ టీకాతోనే టీబీ కట్టడి



వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

చిత్తూరు రూరల్(కాణిపాకం): బీసీజీ వ్యాక్సిన్‌తోనే క్షయ వ్యాధిని కట్టడి చేయగలిగామని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని మాపాక్షి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిష్యత్‌లో టీబీ లేని సమాజం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ముందస్తు నివారణ చర్యల్లో బీసీజీ వ్యాక్సిన్ తీసుకొచ్చిందన్నారు. అర్హులైన వారికి కచ్చితంగా టీకాను వేయాలని సిబ్బందికి సూచించారు.


డిపాజిట్లపై వడ్డీ రేట్ల పెంపు

తవణంపల్లె: సప్తగిరి గ్రామీణ బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచినట్లు తవణంపల్లె శాఖ బ్రాంచ్ మేనేజర్ తిరుమలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్లపై అత్యధికంగా 8.6 శాతం వడ్డీ రేట్లు పెంచినట్లు పేర్కొన్నారు. రెండేళ్లకు పైబడిన డిపాజిట్లపై ఏడాదికి సాధారణ వ్యక్తులకు 8.1 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.6 శాతం వడ్డీ రేట్లు పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా ఏడాదికి సాధారణ వ్యక్తుల డిపాజిట్లకు ఏడాదికి 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీ రేట్లు పెంచినట్లు పేర్కొన్నారు.

పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి

తవణంపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉచిత పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో తవణంపల్లె హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంఈఓలు హేమలత, త్యాగరాజులురెడ్డి, హెచ్‌ఎం శ్రీరంజని, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలుపాల్గొన్నారు.

పారిశుధ్యం పట్టని కార్పొరేషన్



వెంగళరావు కాలనీలో పేరుకుపోయిన చెత్త

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు, ఫలితాలు వెలువడి రోజులు గడుస్తున్నా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం ఇంకా ఆ ప్రక్రియలోనే ఇరుక్కున్నట్లు కనిపిస్తోంది. నగరంలో ఇప్పటికే వాతావరణం మారడం, వర్షాలు మొదలవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. దీన్ని అరికట్టడానికి ముందస్తు ప్రణాళికతో వెళ్లాల్సిన కార్పొరేషన్‌లోని ప్రజారోగ్య విభాగం నిద్రమత్తులో ఉంది. నగరంలోని చాలా చోట్ల చెత్తను తొలగింపజేయడంలో అధికారులు దృష్టి పెట్టడంలేదు. కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారాన్ని శుభ్రం చేయించడం లేదు. మూడు రోజులకో సారి చెత్తను తీయడం ఆపేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణకు గురైన బిసన్నవద్దు చెరువు



యథేచ్ఛగా చెరువు ఆక్రమణ

- నగం చెరువు ఇప్పటికే ఆక్రమణ
- ఫీడర్, సప్లయ్ చానళ్లు సైతం మాయం
- యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణలు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం
- ఇదీ బిసన్నవడ్డు చెరువు దీనగాథ



చెరువు కట్టను జేసీబీతో ధ్వంసం చేస్తున్న దృశ్యం

పెద్దపంజాణి: పూర్వకాలంలో ఊరు పచ్చగా ఉండాలని చెరువులు తవ్వించి పంటలు పండేలా రాజులు చేశారు. కానీ ఇప్పుడు అక్రమార్కులను వీటిపై కూడా కన్నేసి దర్జాగా ఆక్రమించేస్తున్నారు. మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీ తిప్పిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని బిసన్నవడ్డు చెరువును పెనుగొలకలకు చెందిన ఇద్దరు రైతులు సగానికి పైగా చెరువును కబ్జా చేసి తమ పొలాల్లోకి కలుపుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో పాలన స్తబ్ధత నేపథ్యంలో అడిగేవారులేరనే ధైర్యంతో ఇప్పుడు కూడా జేసీబీ వాహనాలు పెట్టి ఆక్రమణలను యథేచ్ఛగా చేస్తున్నారు. చెరువు ఆయకట్టు దారులు ఇప్పటికే ఈవిషయపై స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవు. పైగా అధికారుల సాక్షిగా ఆక్రమణలు సాగుతున్నా తమకెందుకులే అనే విధంగా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయకట్టు దారులు ఆవేదన చెందుతున్నారు.

తొమ్మిదెకరాల చెరువులో సగానికిపైగా ఆక్రమణ..

రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్లు 107–2,3,4లో మొత్తం 8.71 ఎకరాలుగా ఉంది. అయితే ప్రస్తుతం ఇందులో నాలుగెకరాలు కబ్జాకు గురైంది. పైపెచ్చు చెరువుకు సంబంధించిన సప్లయ్ చానళ్లు సైతం నాశనం చేశారు. చెరువుకట్టను ధ్వంసం చేస్తున్నారు. దీంతో వర్షాలు పడినా వరదనీరు చెరువులోకి రాకుండా పోయింది. ఈ విధంగా నీటిని రానీయకుండా చేస్తూ మొత్తం చెరువును మాయం చేయాలనే దురుద్దేశంతో ఆక్రమణదారులు పథకం మేరకు ఇలా అక్రమాలు చేస్తున్నారని ఆయకట్టులోని మార్కొండారెడ్డి, ఆంజిరెడ్డి, అమరారెడ్డి ఈసందర్భంగా చెబుతున్నారు.

ఒకరిపై మరొకరు వేసుకుంటూ..

చెరువు ఆక్రమణపై ఆయకట్టు రైతులు స్థానిక తహసీల్దార్ నాగేంద్ర దృష్టికి తీసుకెళ్లగా ఆయన చెరువు విషయం తనకు సంబంధం లేదంటూ పట్టించుకోలేదు. ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు దీనిపై స్పందించలేదు. దీంతో బాధిత రైతులు చెరువును ఎలా కాపాడుకోవాలో దిక్కుతోచడం లేదని చెబుతున్నారు. చెరువు కబ్జా కారణంగా కిందనున్న భూములకు నీరందక పచ్చటి పొలాలు బీడు భూములుగా మారాయి. జిల్లా స్థాయి అధికారులైనా ఈ కబ్జాపై స్పందించి చెరువును కాపాడాలని చెరువును నమ్ముకొని సేద్యం చేసే కుటుంబాలు విన్నవిస్తున్నాయి.

సీరియల్ సెట్ నిర్వాహకులకు పండగే!

-ఎల్లో లైట్లే కావాలనడంతో భలే డిమాండ్



పలమనేరు ఎంపీడీఓ కార్యాలయానికి అమర్చిన సీరియల్ సెట్లు

పలమనేరు: చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని సీరియల్ సెట్ నిర్వాహకులకు మేలు జరిగింది. సాధారణంగా వీరివద్ద రకరకాల రంగుల్లో సీరియల్ సెట్ లైట్లుంటాయి. కానీ ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి పసుపు వర్ణంలోని సీరియల్ సెట్లను మాత్రమే వాడాలనే ఆదేశాలున్నట్టు సమాచారం. దీంతో నియోజకవర్గంలోని 110 సచివాలయాలు, తహసీల్దార్, ఎంపీడీఓ పదికి పైగా కార్యాలయాలకు మొన్నటి కార్యక్రమానికి పసుపు కలర్ సీరియల్ సెట్లు వేశారు. అన్ని చోట్లా పసుపు కలరే కావాల్సి ఉండడంతో వాటి నిర్వాహకులు సైతం నెలకొన్న డిమాండ్ కారణంగా ధరలు పెంచేశారు. సాధారణంగా ఉన్న ధరకంటే రెట్టింపు చెప్పినప్పటికీ ఆయా మండల అధికారులు వాటినే ఏర్పాటు చేయాల్సి వచ్చింది. మొత్తం మీద రాజు అనుకుంటే కొరడా దెబ్బలకు కరువా అన్నట్టు అధికారులు సైతం ఒక్కో కార్యాలయానికి రెండ్రోజులకు పదివేల దాకా చెల్లించి వీటిని అమర్చాల్సి వచ్చింది. ఏందబ్బా అన్ని ఆఫీసులకు పసుపు లైట్లేనా అంటూ జనం చర్చించుకోవడం ఈసందర్భంగా కనిపించింది.

అభివృద్ధికి సంపూర్ణ మద్దతు

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ఇచ్చి, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుంటుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిన్న రాయల్ తెలిపారు. గురువారం జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. నేతలు శ్రీనివాసులు, శివప్పనాయుడు, హరి, చంద్ర, తిరుమలేశు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తాం



కొత్త అడ్మిషన్లు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

చౌడేపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పించి ఆదర్శవంతమైన జీవితానికి పునాది వేసేలా చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ కేశవరెడ్డి తెలిపారు. గురువారం చౌడేపల్లెలోని విద్యాశాఖా కార్యాలయం వద్ద గల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలకు నూతన అడ్మిషన్ల కోసం వచ్చిన 15 మంది విద్యార్థుల నుంచి హెచ్‌ఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు హరిబాబు, మురళి, శంకర్ దరఖాస్తులు స్వీకరించారు. తమ పాఠశాలలో విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో నైపుణ్యంలో ప్రావీణ్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. పాఠశాలను నాడు–నేడు ద్వారా మౌలిక వసతులు, అన్నివిధాలుగా సదుపాయాలు కల్పించడంతో తల్లితండ్రులు ఆసక్తిచూపడం విశేషమన్నారు.

పేదలందరికీ వైద్య సేవలు



మల్లకుంటలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలందరికీ వైద్యసేవలందిస్తున్నామని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని మల్లకుంటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యశిబిరంలో 45 మంది రోగులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలన్నారు. జ్వరాలు సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి, వైద్యం చేయించుకోవాలన్నారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ



విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

పలమనేరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ స్టూడెంట్ కిట్స్‌ను స్థానిక ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం గురువారం పంపిణీ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వద్ద జరిగిన పంపిణీ కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 6,950మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, షూలు, బెల్టులు, నోట్ పుస్తకాలను అందజేస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే బ్యాగులు, యూనిఫామ్ క్లాత్ అందుతుందన్నారు. మండలంలోని 70 పాఠశాలల్లో ఈ పంపిణీ కార్యక్రమం జరిగిందని పేర్కొన్నారు. వీటిని పిల్లలు చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం షంషీర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

62 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: 189 కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి సంధ్య గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. మొత్తం 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. వేసవి జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. మంచానికి పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది విజయ, చంద్ర, అనురాధ, అనిత, శివగామి పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్య అవసరం



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందిస్తున్న డీఈఓ దేవరాజు

గంగాధర నెల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని, ఒత్తిడి లేని విద్య అవసరమని చిత్తూరు జిల్లా విద్యాధికారి దేవరాజు అన్నారు. మండలంలోని నెల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మమేకమై ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పిల్లలతో ఆయన ముచ్చటించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. 2024 జరిగిన పదో తరగతి ఫలితాలలో మండలంలోని మొదటి, రెండో, మూడో స్థానం నెల్లేపల్లి పాఠశాలకు రావడంతో విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోటుపుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంజనేయులు శెట్టి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయుడు యుగంధర్ ఆచారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు శ్రేయస్కరం

- అంతరపంటగా అధిక దిగుబడులు
- వ్యవసాయాధికారుల సూచనలు





వేరుశనగ విత్తనాలు వేస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్) వ్యవసాయాధికారి నాగరాజు

గుడుపల్లె: ఖరీఫ్ సీజన్‌లో వేసే వేరుశనగ పంటలో చిరుధాన్యాల సాగు రైతులకు ఎంతో శ్రేయస్కరమని వ్యవసాయశాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ పంట పండించాలంటే రూ.25 వేల నుంచి 30 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. పంటలు వేసిన అనంతరం అంతరపంటలుగా చిరుధాన్యాలు వేస్తే అదే పెట్టుబడితో మరింత లాభాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. చిరుధాన్యాలు ప్రత్యామ్నాయ పంటలు కొర్ర, అండుకొర్ర, సజ్జ, జొన్న, అలసంద, కంది, సామ వేయడంతో ఆదాయం కూడా ఎక్కువగా పెరుగుతుందన్నారు. వాతావరణంలో మార్పులు, తక్కువ, వర్షపాతం ఉన్నా కూడా చిరుధాన్యాల పంటలు మాత్రం పండుతాయని తెలిపారు. చిరుధాన్యాల విత్తనాలకు కూడా తక్కువ ధరల్లో అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. వేరుశనగ వేసే సమయంలో అంతర పంటలుగా చిరుధాన్యాలు వేసుకుని అధిక లాభాలను రైతులు పొందాలని తెలిపారు.

అంతర పంటలను అలవాటు చేసుకోవాలి..

ఖరీఫ్ సీజన్‌లో వేసే వేరుశనగ పంటల్లో అంతరపంటలుగా చిరుధాన్యాల పంటల వేయడం ప్రతి రైతు అలవరచుకోవాలి. చిరుధాన్యాల పంటలకు ప్రత్యేకమైన ఎరువులు, మందులు వేసే అవసరం లేదన్నారు. ఒకే పంటలో ఐదారు అంతరపంటలను చేసుకోవాలన్నారు. అంతర పంటలు చేయడంతో భూమి కూడా సారవంతంగా ఉంటుందన్నారు. చిరుధాన్యాలు 60 నుంచి 70 రోజుల్లో పంటలు కోతకు వస్తాయి. చిరుధాన్యాలు ఎక్కువగా సేంద్రియ ఎరువులతోనే పండుతాయని పేర్కొన్నారు. దీంతో ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిందని చెప్పారు. అతివృష్టి, అనావృష్టి జరిగినా కూడా వేసిన పంటలు అధిక దిగుబడులు రావాలంటే చిరుధాన్యాలు వేసుకోవాలన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు..

వేరుశనగ పంటలలో అంతరపంటలు వేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వస్తాయి.. పంటలకు ఒకేసారి ఎరువులు, కలుపు తీయడం వంటి పనులు జరుగుతాయి. వేరుశనగ పంటలకు వేసే పెట్టుబడితోనే పంటలు పూర్తిగా సాగు అవుతుంది. అంతర పంటలతో బయట నుంచి పంటను తినడానికి వచ్చే పురుగుల నుంచి కాపాడుతుంది. పంటలకు తెగుళ్లు రాకుండా ఉండడంతో పాటు పురుగులు నియంత్రణ అవుతుంది. దీంతో పంటలు అధిక దిగుబడులతో పాటు భూమి సారవంతం కూడా అవుతుంది.

కోలాహలం.. గంగ జాతర



బంగారుపాళెం: జలప్రవేశానికి తరలుతున్న గంగమ్మ



తగ్గువారిపల్లెలో..

బంగారుపాళెం: మండల కేంద్రంలోని దళితవాడలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సును విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఉట్ల తిరునాళ్లను నిర్వహించారు. ఉట్లమాను అధిరోహించేందుకు యువకులు పోటీపడ్డారు. రాత్రి అమ్మవారిని మేళతాళాలు, బాణసంచా వేడుకల నడుమ జలప్రవేశానికి తరలించారు. అలాగే మండలంలోని తగ్గువారిపల్లె గ్రామంలో బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.